క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత


ఎల్‌ఓసీ పత్రాన్ని ఇస్తున్న సచిన్

మల్హర్: మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన భూక్య మాధురి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆర్థిక సాయం కోసం కుటుంబ సభ్యులు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీఎంఆర్‌ఎఫ్ ద్వా రా రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించి మంత్రి శ్రీధర్‌బాబు ఆస్పత్రి సహాయకుడు సచిన్ ద్వారా శనివారం ఎల్‌ఓసీ పత్రానికి బాధిత కుటుంబ సభ్యులకు అందించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


సరుకులు అందజేస్తున్న సభ్యులు

రేగొండ: మండలంలోని భాగిర్థిపేట గ్రామానికి చెందిన సూర లింగయ్య, సూర రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను శనివారం జిల్లా మున్నూరుకాపు సంఘం సభ్యులు పరామర్శించి, 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. జిల్లా మున్నూరు కాపు సంఘం సభ్యులు కొటం రవీందర్, గుమ్మడి ప్రదీప్, గండు రమేశ్, అనంతుల సంపత్, సంకటి రవి, కోసరి రాజు, చల్ల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి పట్టణంలోని 11 కేవీ కృష్ణకాలనీ ఫీడర్‌పై మరమ్మతుల నేపథ్యంలో నేడు (ఆదివారం) కృష్ణ కాలనీ, యాదవ్ నగర్, కారల్‌మార్క్స్ కాలనీ, రాజీవ్ నగర్, అంబేడ్కర్ సెంటర్, పోలీస్ స్టేషన్ రోడ్, ఎమ్మార్వో కార్యాలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని భూపాలపల్లి పట్టణ ఏఈ విశ్వాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

నియామకం


కుమారస్వామి

భూపాలపల్లి అర్బన్: సీపీఐ ఎంఎల్ లిబరేషన్ భూపాలపల్లి మండల కన్వీనర్‌గా బుర్రి కుమారస్వామిని నియమించినట్లు జిల్లా కార్యదర్శి మారెపల్లి మల్లేశ్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో కుమారస్వామిని ఎన్నుకున్నట్లు తెలిపారు.

కుంగిన సీసీ రోడ్డు



వాజేడు: మండల కేంద్రంలోని శివాలయం వీధిలో సీసీ రోడ్డు పగిలి కుంగిపోయింది. దీంతో వాహనదారులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్డును మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

యథేచ్ఛగా గ్యాస్ దందా!

- అధిక ధరలకు విక్రయం
- సామాన్యులకు భారం
- పట్టించుకోని అధికారులు


టేకుమట్లలో బ్లాక్‌లో అమ్మేందుకు రహదారి వెంట ఉంచిన గ్యాస్ సిలిండర్లు

టేకుమట్ల: ప్రజల్లో నిత్యావసరాల్లో ప్రధానమైనది వంట గ్యాస్. గ్యాస్ సిలిండర్ లేని ఇళ్లు లేదంటే అతిశయోక్తి లేదు. గ్యాస్ పంపిణీ చేసే ఏజెన్సీ వారు ఇదే అదునుగా భావించి సామాన్యుల నుంచి అదనంగా వసూల్ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు పలు ఏజెన్సీలు సరఫరా చేస్తున్నాయి. రవాణా ఖర్చులను కలుపుకుని గ్యాస్ ఏజెన్సీల నుంచి వినియోగదారులకు ఒక్కో గ్యాస్ సిలిండర్‌కు రూ.925 ఉండగా గ్యాస్ సిలిండర్ రవాణా ఖర్చుల పేరుతో రూ.55 అదనంగా జమ చేస్తూ మొత్తంగా రూ.980లను వసూల్ చేస్తూ సొమ్ముమ చేసుకుంటున్నారు. గ్యాస్ బుక్ చేసుకున్నప్పుడు రూ.925 కదా అని అడిగిన వారికి రవాణా ఖర్చుల కోసం అంటూ తప్పించుకుంటున్నారు.

బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న గ్యాస్

గ్యాస్ వినియోగదారులు గ్యాస్ బుక్ చేసుకున్నాక 24 నుంచి 48 గంటల్లో గ్యాస్‌ను సరఫరా చేయాలి. కాని గ్యాస్ ఏజెన్సీలు సకాలంలో అందించకుండా డోర్‌లాక్ అంటూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ గ్యాస్‌ను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. అత్యవసరంగా కావాలనుకునే వినియోగదారులు బ్లాక్ మార్కెట్‌లో రూ.1100 నుంచి రూ.1200వరకు అదనంగా చెల్లిస్తూ కొనుగోలు చేస్తున్నారు. బ్లాక్ మార్కెట్ వ్యాపారులు 10 నుంచి 20 గ్యాస్ సిలిండర్‌లను యథేచ్ఛగా రోడ్లపై పెట్టి విక్రయిస్తున్నారు. గ్యాస్ బుక్ చేసుకున్న వినియోగదారులకు సకాలంలో అందని గ్యాస్ బ్లాక్ మార్కెట్‌కు ఎలా సరఫరా అవుతుందని ప్రజలు అవాక్కుఅవుతున్నారు.

కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల జాడే లేదు..

టిఫిన్ సెంటర్లు, హోటళ్లు తదితర వ్యాపార సముదాయాల్లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను వినియోగించాలనే నిబంధనలు ఉన్నా కమర్షియల్ గ్యాస్ సిలిండర్లకు బదులుగా డొమెస్టిక్ సిలిండర్లను మాత్రమే వినియోగిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ సబ్సిడీని కొల్లగొడుతున్నారు. వ్యాపార సముదాయాల్లో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల వినియోగం ఎక్కువగా పెరిగిపోవడంతో ఇందన ఏజెన్సీలు ఇళ్లకు సరైన సమయంలో సరఫరా చేయకుండా వ్యాపార సముదాయాలకు ఎక్కువ ధరకు విక్రయిస్తూ అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్యాస్ సిలిండర్ల అక్రమ రవాణాపై నిఘా ఉంచి వినియోగదారులకు సకాలంలో గ్యాస్ సిలిండర్లను అదించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రతీసారి ఎక్కువ చెల్లిస్తున్నా..



గ్యాస్ బుక్ చేసుకున్న ప్రతీ ఎక్కువ చెల్లించి సిలిండర్ తీసుకుంటున్నా.. ఒక్కోసారి గ్యాస్ రేట్లు పెరిగినప్పుడు ఎక్కువగానే చెల్లిస్తున్నాం. గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసే వ్యక్తి ఎంత అడిగితే అంత ఇస్తున్నాం. గ్యాస్ ఇచ్చే వాళ్లు డబ్బులు ఎక్కువగా తీసుకుంటున్నారని మాకు తెలియదు. గ్యాస్‌కు ఎక్కువ డబ్బులు తీసుకునే వారిపై అధికారులు చర్య తీసుకోవాలి.

– ఎలవేని ధనలక్ష్మి, గృహిణి, టేకుమట్ల

చట్ట వ్యతిరేక చర్యలను ఖండించాలి

- ఎస్పీ శబరీశ్


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్పీ

వెంకటాపురం(కె): మావోయిస్టులు చేస్తున్న చట్ట వ్యతిరేక చర్యలను ఖండించాలని ఎస్పీ శబరీశ్ అన్నారు. మండలంలోని ముకనూరుపాలెం గామానికి చెందిన కామయ్య ముకునూరు గుట్టల్లో ప్రెజర్ బాంబ్ పేలి గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ఎస్పీ శబరీశ్ శనివారం పరామర్శించి మాట్లాడారు. బాధిత కుటుంబానికి పోలీస్ శాఖ అండగా ఉంటుందని తెలిపారు. మావోయిస్టులు చేసిన దుచర్యలను ప్రజలు అందరు ఖండించాలని అన్నారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సాయం అందించేలా కృషి చేస్తామని అన్నారు. మృతుడి భార్య సమ్మక్కకు పక్షవాతం, కూతరుకు మతిస్థిమితం లేదని పెన్షన్ వచ్చేలా చూడాలని కుటుంబ సభ్యులు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో వారికి పెన్షన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని వెంకటాపురం సీఐ బండారి కుమార్‌ను ఎస్పీ ఆదేశించారు. ఆమన వెంట ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ఎస్సైలు కొప్పుల తిరుపతి రావు, సివిలల్ పోలీసులు,సీఆర్‌పీఎఫ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత


మొక్క నాటుతున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది

కాటారం: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని అటవీశాఖ అధికారులు తెలిపారు. అటవీశాఖ ఆధ్వర్యంలో మండలంలో శనివారం వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కాటారం గ్రామ పంచాయతీ ఆవరణతో పాటు చిద్నెపల్లి గ్రామపంచాయతీ, ప్రభుత్వ పాఠశాల ఆవరణలో గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాతావరణ సమతుల్యతలో మొక్కలు ప్రముఖ పాత్ర పోషిస్తాయని జీవకోటి మనగడకు చెట్లు ఆధారం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం, యామన్‌పల్లి డిప్యూటీ రేంజర్లు సురేందర్, శ్రీనివాస్, సెక్షన్ అధికారులు చంద్రశేఖర్, అర్చన, పంచాయతీ కార్యదర్శి షగీర్‌ఖాన్, బీట్ అధికారులు రాజేందర్, అశోక్, సంజీవ్, జయలక్ష్మి, మోహినొద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న మహిళ అరెస్ట్


మహిళను అరెస్టు చూపుతున్న పోలీసులు

ఏటూరునాగారం: గంజాయి తరలిస్తున్న మహిళను శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై రాజకుమార్ తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఎస్సై వివరాలను వెల్లడించారు. మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన నిఖత్ అనే మహిళ మండల కేంద్రంలోని కొంతమంది యువతకు గంజాయిని విక్రయిస్తుందన్నారు. ఈ మేరకు సమాచారంతో తాళ్లగడ్డలోని బాలికల గురుకుల ఆశ్రమ పాఠశాల వద్ద తనిఖీ చేయగా మహిళ వద్ద 230 గ్రాముల ఎండు గంజాయి లభించిందని తెలిపారు. ఆమెకు చెందిన ద్విచక్రవాహనాన్ని, ఫోన్‌ను స్వాధీనం చేసుకొని మహిళను అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. రెండు రోజుల క్రితం హనుమకొండ బస్టాండ్ లో వాహదుళ్ల దగ్గర కొనుగోలు చేసినట్లు వెల్లడైందన్నారు. విచారణ అనంతరం సీఐ శ్రీనివాస్ ఆదేశాల మేరకు మహిళపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

బీసీ రిజర్వేషన్ల పెంపుపై హర్షం


టేకుమట్ల: స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

టేకుమట్ల: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు పెంచడంపై హర్షిస్తూ శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చిత్రపటాలకు నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్ గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిందన్నారు. కత్తి సంపత్, వంగ కుమారస్వామి, మొగిళి, వంగ నరేష్, బోండ్ల మహేష్, కట్ల లస్మయ్య, పోలుదాసరి రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: రాష్ట్రంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో భాగంగా కాంగ్రెస్ పార్టీ కట్టుబడి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి అన్నారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. నాయకులు చిలుకల రాయకొమురు, దొడ్డి కిష్టయ్య, మూల శంకర్‌గౌడ్, గడ్డం కొమురయ్య, బుర్ర లక్ష్మన్ గౌడ్, బుర్ర శ్రీనివాస్, దబ్బెట అనిల్, రాజమౌళి, నర్సయ్య, సంతోష్, అశోక్, సదయ్య, నర్సింహారాములు, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో ప్రయాణించాలి



యువకులతో మాట్లాడుతున్న ఎస్సై కృష్ణప్రసాద్

వాజేడు: యువత సన్మార్గంలో ప్రయణించాలని పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని పేరూరు గ్రామంలో అభ్య మిత్రలో భాగంగా శనివారం యువకులతో మాట్లాడారు. యువత గంజాయి అమ్మడం, సేవించడం చేయొద్దన్నారు. అసాంఘిక శక్తులకు సహకరించవద్దని సూచించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. ఈ సదర్భంగా యువకులకు వాలీబాల్ కిట్ అందించారు.

పరామర్శ


తిమ్మంపేటలో పరామర్శిస్తున్న నాగజ్యోతి

మంగపేట: మండలంలోని తిమ్మంపేటకు చెందిన ఫర్టిలైజర్ యజమాని చిలకమర్రి వేణు ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి శనివారం పరామర్శించారు. అదే విధంగా మల్లూరు పంచాయతీ పరిధిలోని మొట్లగూడెంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ఆరెల్లి వెంకటయ్య కుటుంబాన్ని పరామర్శించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, ఏటూరునాగారం మండల అధ్యక్షుడు గడుదాసు సునీల్‌కుమార్, జిలా సీనియర్ నాయకుడు తుమ్మ మల్లారెడ్డి, తాటి కృష్ణ, ఎండీ ఖాజా పాషా, చిలకమర్రి రాజేందర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నర్సంపేట : పట్టణంలోని శ్రీ భూనీలా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 100 మందికిపైగా ప్రజలు రాగా హనుమకొండ జిల్లా కేంద్రానికి చెందిన అజరా ఆస్పత్రి వైద్యులు బీపీ, షుగర్, జనరల్ చెకప్ చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ముడుంబై రామానుజచార్యులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దుబ్బ రమేశ్, కార్యదర్శి వేంశెట్టి శ్రీనివాస్, సభ్యులు రామగోని సుధాకర్, చింతల నిరంజన్, శింగిరికొండ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

- వస్రా ఎస్సై అచ్చ కమలాకర్


తనిఖీ చేస్తున్న ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట: యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. మండల వ్యాప్తంగా ప్రధాన కూడలిలో, పెద్ద పెద్ద షాపుల్లో నార్కోటిక్ స్నైపర్ డాగ్‌తో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిద్దడమే ఎస్పీ డాక్టర్ శబరీశ్ ముఖ్య ఉద్దేశమన్నారు. గ్రామీణ ప్రాంత యువత మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకొవద్దని సూచించారు. మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్న వ్యక్తుల సమాచారం తెలిస్తే పోలీసులకు తెలపాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం

- ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి నాగరాజు

నర్సంపేట : విద్యారంగ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) జిల్లా సహాయ కార్యదర్శి మార్త నాగరాజు విమర్శించారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో శనివారం నిర్వహించిన సమాఖ్య ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాసంవత్సరం మొదలై నెల రోజులు గడుస్తున్న ప్రభుత్వ స్కూళ్లలో సమస్యలు అలాగే ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అధికారులు పనులు చేయించడం లేదని, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ స్కూళ్లు, హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంతోపాటు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సమాఖ్య బాలికల విభాగం కన్వీనర్ గణిపాక బిందు, జిల్లా కమిటీ సభ్యులు సాగర్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా రహదారి


గుంతలమయంగా మారిన రోడ్డు

వాజేడు: మండల పరిధిలోని ప్రగళ్లపల్లి, ఆరుగుంటపల్లి గ్రామాల మధ్య పోసిన డైవెర్షన్ రహదారి గుంతలమయంగా మారి ప్రమాదకరంగా తయారైంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని ఆరుగుంటపల్లి, ప్రగళ్లపల్లి గ్రామాల మధ్యన పాలెం ప్రాజెక్టుకు సంబంధించిన కాల్వ మరమ్మతు పనులు నిర్వహిస్తున్నారు. కాగా ప్రయాణికులకు ఇబ్బందులు రాకుండా ఉండడం కోసం వాజేడు, భద్రాచలం రహదారిని తొలగించి డైవెర్షన్ రోడ్డును గ్రావెల్‌తో వేశారు. ఈ రహదారిపై ఎక్కువగా ఇసుక లారీల వంటి భారీ వాహనాలు తిరుగడంతో గుంతలమయంగా మారింది. దీంతో మరమ్మతు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

గోరింటాకు సంబురం


గోరింటాకు సంబురాల్లో పాల్గొన్న మహిళలు

కాటారం: ఆషాఢమాసంను పురస్కరించుకొని మండల కేంద్రంలో శనివారం మహిళలు గోరింటాకు సంబురాలు నిర్వహించుకున్నారు. ఆషాఢమాసంలో గోరింటాకు పెట్టుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జాడి మహేశ్వరీ, అయిత శకుంతల, బొమ్మ సరోజన, బొమ్మ దీప్తి, మంజుల, భూక్య మంజుల, స్వరూప, లక్ష్మి, రజిత, కొండ రాజమ్మ, అంజలి, లక్ష్మి, రాజేశ్వరీ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తెరిచేదెన్నడో?

- ఉపాధ్యాయులు లేక మూతబడిన గిరిజన ప్రాథమిక పాఠశాల
- ఇళ్ల వద్దనే విద్యార్థులు


తెరుచుకోని ప్రాథమిక పాఠశాల


ఉపాధ్యాయుడి కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని కలిపాకలోని గిరిజన ప్రాథమిక పాఠశాల నేటి వరకు తెరుచుకోలేదు. మండలంలోని అన్ని పాఠశాలలు ప్రారంభమై నెల రోజులైనా ఈ పాఠశాల గురించి పట్టించుకునే వారే కరువయ్యారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులను వేరే పాఠశాలలో చేర్పించాలా లేక తెరిచే వరకు వేచి చూడాలో అర్థం కావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గత విద్యాసంవత్సరంలో గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపడితే పాఠశాలకు తాత్కాలిక ఉపాధ్యాయుడిని నియమించారు. ఈ ఏడాది నియమించకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాల గిరిజన ప్రాథమిక పాఠశాల కావటంతో ఈ పాఠశాలకు ఐటీడీఏ నుంచి అయినా ఉపాధ్యాయుడిని నియమించాలని పీఓ చిత్రామిశ్రాను గ్రామస్తులు కోరుతున్నారు. పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు సుమారుగా 20 మంది విద్యార్థులు ఉన్నారని, పాఠశాల తెరవక పోవడంతో నిత్యం ఊరికే తిరుగుతున్న పరిస్థితులు ఉన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుడిని నియమించాలి..



కలిపాక గ్రామంలోని గిరిజన ప్రాథమిక పాఠశాలకు ఐటీడీఏ నుంచి ఉపాధ్యాయున్ని నియమించాలి. మండల విద్యాశాఖ నుంచి ఉపాధ్యాయుడిని నియమించేందుకు అనుమతులు లేవు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– ఎంఈఓ సత్యనారాయణ

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి


మృతి చెందిన ఎద్దు

భూపాలపల్లి రూరల్: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన భూపాలపల్లి మండలంలోని ఆజాంనగర్‌లో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆజాంనగర్ గ్రామానికి చెందిన పట్టెం శ్రీనివాస్‌కు చెందిన ఎద్దు పొలం గట్లపై మేత మేస్తుండగా విద్యుత్ వైరుకు తగిలి షాక్ గర్రై అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఎద్దు విలువ సుమారుగా రూ.60 వేలు ఉంటుందని ప్రభుత్వం నష్ట నష్టపరిహారం చెల్లించి బాధితుడిని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.